నాకు పెళ్ళయి మా రాణీగారు కాపురానికొచ్చిన కొన్నాళ్ళదాకా రాజభోగం అనుభవించానంటే నమ్మండి. నేనుఏది అడిగితే అగి మరుక్షణంలోనే హాజరయేది నా ముందు. కాని ఆ రాజభోగం కొన్నాళ్ళేనని ముందు చెప్పానుకదూ!





# హౌస్ పార్లమెంట్

రచన
శ్రీకంఠమూర్తి

దీనికి కారణం నా భార్యకు నామీద ప్రేమలేదేమోనని భావిస్తే మీరు పొరబడుతున్నారన్నమాట ! నా భార్యకు నా మీద బోలెడు ప్రేముంది. "హృదయేశ్వరా !" "ప్రాణేశ్వరా !!" వగైరా పదాలతో ప్రారంభమయి, "ఇట్లు మీ చరణదాసి" అన్న వాక్యంతో ముగించబడిన ఉత్తరాలే చెబుతున్నాయి ఆమెకు నా మీద ఎంత ప్రేముందో ! మరయితే ఈ మధ్య నన్ను అంత నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నట్టు ?

నోరు నొప్పెట్టేదాకా నేను "కాఫీ ! కాఫీ !" అని అరుస్తేగాని ఆ గుక్కెడు కాఫీ నే నుండేచోటికి రాదు. అదయినా అరకప్పు కాఫీ తెచ్చి నా ముందు పెట్టేసి గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోతుంది మా ఆవిడ.

పోనీ కన్నతల్లిగదా! మొన్న మొన్నటి వరకూ నా అవసరాలు స్వయంగా తనుక్కుని అన్నీ అమర్చేదికదా అనుకుని అమ్మను "అమ్మా ! కాఫీ అయిందా ?" అని అడిగితే "ఇంకా నేనే కావాలేమిరా నీకు కాఫీ చేసివ్వడానికి ? నీ పెళ్ళాం వుందిగా అడుగు." అని నిష్కర్షగా అనేస్తుంది.

ఇంట్లో అత్తా-కోడళ్ళిద్దరూ ఎడమొహం పెడమొహం. ఒకరిపొడ మరొకరికి గిట్టదు. ఇంట్లో ప్రతిరోజూ యుద్ధకాండమే అనుకోండి.

"ఇవ్వాళ సాయంకాలం అబ్బాయి రానీ, నీ సంగతేమిటో కనుక్కుంటా !" అని అమ్మ రుసరుస లాడితే, "వస్తే ఏం భయమా ? నేనూ చెబుతాను, నన్ను మా పుట్టింటికి పంపించేయండి. నే నిక్కడుండ లేను." అని ఈవిడ సాధింపు. ఇద్దరిమధ్యా నలిగిపోతున్నాను.

ఎలాగైనా వీళ్ళ పోట్లాటను మానిపించాలని శతవిధాల ప్రయత్నించాను. సాంసారిక కథావస్తువులతో కూడిన (అత్తా - కోడళ్ళకు సంబంధించిన) సినిమాలన్నీ చూపించాను. ఎన్నో పురాణాలూ, పుణ్యకథలూ, నవలలూ, నాటకాలూ చదివి వినిపించాను. ఉహూఁ ప్రయోజనం లేకపోయింది. పోనీ ఇంటికి పెద్దకదా అని నాన్నగారి దగ్గరికెళ్ళి "కాస్త వీళ్ళ పోట్లాటను మీరైనా అదుపులో పెట్టండి నాన్నగారూ !" అని వేడుకున్నాను.

"నన్నేం చేయమంటావురా ? వాళ్ళు వింటేగా ? నువ్వే ఏదైనా ఉపాయం కనిపెట్టు" అని తప్పించుకున్నారు నాన్నగారు.

చివరికి చేసేదిలేక నా ఆంతరంగిక మిత్రులను సలహా అడిగాను. వాళ్ళు ఫక్కున నవ్వేశారు.

"ఓస్ ఈ మాత్రం దానికే ఇలా నీరు గారిపోతావేమిట్రా ? ఇది అందరిళ్ళల్లోనూ వుండే గొడవేలే !" అని తేలిగ్గా చెప్పేశారు.

ఇహ లాభం లేదనుకుని రెండు రోజులు ఆఫీసుకు సెలవుపెట్టేసి, నా గదిలో తలుపులు బిడాయించి కూర్చుని తీవ్రంగా ఆలోచించ సాగాను.

ఇలా ఆలోచించగా చించగా ఒక బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. వెంటనే ఎగిరి గంతేసి గదితలుపులు రెండూ బార్లా తెరిచి బిగ్గరగా కేక పెట్టాను.

"అమ్మా ! ఓసారి ఇట్రా. ఒసేవ్ నువ్వుకూడా. చెల్లాయ్ నువ్వూ, తమ్ముడూ, నాన్నా అందరూ రండి."

రెండు రోజుల నా మౌనం ఇంట్లో అందరిమీదా బాగా పని చేసిందేమో అందరూ గబగబా వచ్చారు.

"ఇదుగో ఇవాల్టినుంచీ అత్తా - కోడళ్ళిద్దరూ ఎంతైనా పోట్లాడుకోవచ్చు.నువ్వు కూడా చెల్లాయ్. అందరికీ లైసెన్సు ఇచ్చేస్తున్నాను" అన్నాను.

ఎవరూ నోరెత్తలేదు. గుడ్లు తేలేసి చూస్తూ కూర్చున్నారు.

నేను మళ్ళీ ప్రారంభించాను.

"అయితే ఒక కండిషన్. మీ పోట్లాటంతా నా ముందే జరగాలి. అమ్మా! నువ్వు కోడల్ని తిట్టదల్చుకుంటే దానికి కారణం చెప్పాలి. చెల్లాయ్. నీకూ, వదినకూ కూడా వర్తిస్తా యీ మాటలు. ఇంట్లో నేను లేనప్పుడు మీలో మీరు ఏ కారణంగానూ పోట్లాడుక్కోకూడదు. ఏం ? తెలిసిందా ?"

అందరూ తల లూపారు యాంత్రికంగా. కాని మా ఆవిడమాత్రం "చాల్లెండి మీ తెలివి" అన్నట్లు చూసింది నా వైపు.

చెల్లాయి ఉండబట్టలేక పైకే అడిగేసింది ధైర్యంగా.

"అయితే ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చుంటావా అన్నయ్యా ? మా పోట్లాటలు వినడానికి ?"

వెంటనే మరో అస్త్రం ప్రయోగించాను.

"ప్రతి ఆదివారం మధ్యాహ్నం రెండింటికి మీటింగు పెడతాను. మీ గొడవలేమిటో అప్పుడు చెప్పుకోవాలి. నాలుగు గంటలకల్లా మీటింగు అయిపోతుంది."

ముగ్గురాడవాళ్లూ ఆశ్చర్యంతో "ఆఁ!" అన్నారు ఒక్కసారిగా.

"ఆఁ లేదు వూఁ లేదు. నేను చెప్పినట్టు జరిగితీరవలసిందే ! ఇంట్లో వంట, భోజనాలు, పిల్లలను బడికి పంపడం, నాన్నగారి పూజ - అన్నీ వేళకు సరిగ్గా జరిగిపోవాలి.... ఆఁ....ఈ రోజు సోమవారం. వచ్చే ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మీటింగు. గుర్తుంచుకోండి" అనేసి గబగబా బయటికి వెళ్ళిపోయాను.

ఆ రోజు సాయంకాలం షికారు బయలుదేరేముందు మా ఆవిడ గదిలోకొచ్చి తచ్చాడ్డం ప్రారంభించింది. నేను ఎంతకూ పలకరించక పోవడం చూసి తన మాట మొదలెట్టింది.

"ఏమండీ అత్తగారు నన్ను...." అని దీర్ఘం తీయబోయింది.

మధ్యలోనే ఒక్క ఉరుము ఉరిమాను.

"ఈరోజు ఆదివారం కాదు."

"ఇవ్వాళ నేను సినిమాకు రాను. మీ రొక్కరే వెళ్ళరండి" అని గొణిగింది మూతి ముడుచుకుని.

"నీ ఇష్టం. కాని ఇవ్వాళ నాతో రాకపోయావా, ఇహ జన్మలో సినిమా పేరెత్త కూడదు, అంతే !"

ఆమె మారు మాట్లాడకుండా వచ్చింది.

మర్నాడు భోజనాలకు కూర్చున్నప్పుడు "ఒరే అబ్బాయ్! కాస్త నువ్వయినా చెప్పరా నీ పెళ్ళానికి. అస్తమానం...."అని ప్రారంభించింది మా అమ్మ.

"ఈరోజు ఆదివారం కాదమ్మా" అని ఆమె మాటలు తుంచేశాను.

"అది కాదురా!.... వంట అయ్యేటప్పటికి...."

"అదంతా నాకు తెలీదు. ఆదివారం రెండు గంటలదాకా నేను ఏగొడవావినను." అని ఖచ్చితంగా చెప్పేసి చెయ్యి కడుక్కోవడానికి లేచాను.

ఆదివారం రానే వచ్చింది. ఆరోజు ఉదయంనుంచీ మాయింటి వాతావరణమే మారిపోయింది. ఏదో భయం. ఆతురత. కుతూహలం. అందరి ముఖాలలోనూ ద్యోతక మవుతున్నాయి. ఇంటి పనులు మాత్రం చకచకా జరిగి పోతున్నాయి. నే నిదంతా గమనిస్తూనే వున్నా. ఏమీ ఎరగనట్టు ఉండిపోయాను.

భోజనం కాగానే "రెండు గంటలకు లేపండి." అని అందరికీ వర్తించేటట్టు చెప్పి నాగదిలోకి వెళ్ళిపడుకున్నాను. మా ఆవిడ ఏదో పనివున్నట్టు నాలుగైదు సార్లు గదిలోకి వచ్చి.నన్ను లేపడానికి ధైర్యం చాలక వెళ్ళిపోయింది. నేను మెలకువగానే వుండి ఇదంతా గమనిస్తున్నాను.

రెండుగంటలకు ఇంకా పదినిమిషాలు ఉందనగానే వచ్చింది మా ఆవిడ.

"ఏమండోయ్! కాఫీ అయింది. లేవండి." అంది నన్ను తట్టి లేపుతూ. నేను లేచి కాఫీ త్రాగి మాతమ్ముణ్ని కేకేశాను.

"ఒరేయ్ బుజ్జీ! ఇటు రారా!! కాస్త ఆ జంపకాన ఇక్కడ వెయ్యి. ఒరేయ్ వాసూ! నువ్వు రెండు కుర్చీలు పట్రా. అలాగే నాన్నను కూడా పిలు."

హాలులో మీటింగుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ నిమిషాలమీద జరిగి పోయాయి.

"నాన్నా : మీరిటురండి. ఈ కుర్చీ మీద కూర్చోండి" అని నాన్నగారిని కుర్చీలో కూర్చోపెట్టాను.

ఇంతలో గడియారం రెండుసార్లు మ్రోగింది.

"ఆఁ : ఇహ అందరూ రావచ్చు" అని చెప్పి నేను కుర్చీలో కూర్చున్నాను.

తమ్ముళ్ళిద్దరూ చెల్లెళ్ళు ముగ్గురూ జంపకానామీద కూర్చున్నారు. అమ్మ గుమ్మంలోనూ మా ఆవిడ గోడవారగానూ నిల్చున్నారు.

నేను గొంతు సవరించుకుని మొదలెట్టాను.

"నాన్నా ! మనింట్లో వుండేది మొత్తం తొమ్మండుగురం. ఈ హైదరాబాదు వంటి పెద్ద నగరంలో నా కొచ్చే 180 రూపాయలతో సంసారం గడవడం కష్టమే అయినా భగవంతుడి దయవల్ల ఎలాగో గడిచిపోతున్నది. అలాంటప్పుడు ఇంట్లోవున్న ముగ్గురాడవాళ్ళూ వూరికే వుండలేక ఇలా అస్తమానం పోట్లాడుకోవడం ఏం బాగుంటుంది చెప్పండి. పగలల్లా ఆఫీసులో చచ్చేంత చాకిరీ చేసి సాయంకాల మయేటప్పటికి అలిసిపోయి. ఈసురోమంటూ ఇల్లు చేరుకునే మగవాళ్ళను. ఇంట్లో అడుగుపెట్టిందే తడవుగా వీళ్ళ పోట్లాటలు విని పరిష్కరించమని వేధిస్తే వాళ్ళ గతేంకాను ? చెప్పండి. కాబట్టి ఇవన్నీ బాగా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాను. ప్రతి ఆదివారం హౌస్ పార్లమెంటు సమావేశం కావడం. ఇదే ఆ నిర్ణయం. వారాని కొకసారి సూటిరవై నిమిషాలు వీళ్ళకు ఫ్రీ అన్న మాట. ఆ వ్యవధిలో అందరూ తమ తమ గొడవలను చెప్పి ముగించాలి. ఈ రెండు గంటల టైం దాటిపోయిందంటే మళ్ళీ






వారం రోజులదాకా ఎవరూ నోరెత్తడానికి వీల్లేదు. ఏమంటారు ?"

"ఏమన్నా చేసుకోరా నీఇష్టం." అన్నారు నాన్నగారు నిర్లిప్తంగా.

ఒకసారి అందరివంకా చూశాను. అందరూ ఏదో నేరం చేసిన వారిలా తలలు వంచుకుని నేల చూపులు చూస్తున్నారు.

"పోయిన సోమవారం నుంచి నేటి వరకూ మీరు పోగుచేసుకున్న ఫిర్యాదు లన్నీ ఇప్పుడు చెప్పండి వింటాను. మొదటి ఛాన్సు నీకు చిట్టీ : త్వరగా చెప్పేయ్ ." అన్నాను చెల్లాయి నుద్దేశించి.

చిట్టి మాట్లాడలేదు. ఒకసారి అమ్మ వంకా, మరోసారి వదినవంకా చూసి తల దించుకుంది.

ఆమె మాట్లాడక పోవడం చూసి మళ్ళీ నేనే అన్నాను.

"ఎవరి మనసులో ఏముందో అంతా ఇప్పుడే చెప్పేయాలి. మీటింగు అయిపోయిన తరువాత ఎవరూ బాధ పడకూడదు."

ఈసారికూడా చిట్టి నోరుమెదపలేదు.

"ఇ[illegible]చూడు చిట్టీ : ఒక్కొక్కళ్ళనూ మూడేసి సార్లు అడుగుతాను. ఆ తరువాత ఛాన్సు దొరకదు. ఊఁ.... మొదలెట్టు."

"..............."

"సరే. ఇదివరకే రెండు సార్లడగడమైంది. ఇహ ఆఖరు సారిగా అడుగుతున్నాను. చెబుతావా చెప్పవా? "

"ఇలా నిలదీసి అడిగితే ఏం చెబుతారన్నయ్యా? " బిక్కమొహం వేసుకుని అడిగింది చిట్టి.

"ఇంకెలా అడగాలి? ఊఁ! త్వరగా కానీయి. చూడు అప్పుడే పది నిమిషాలు గడిచి పోయాయి." తొందర పెట్టసాగాను.

ఏం చెప్పాలో తెలీక చివరికి "ఏమీ లేదు" అనేసింది చిట్టి.

"వెరీగుడ్" అనేసి మా ఆవిడ వైపు తిరిగాను.

"ఇహ నీవంతు."

"ఏమీలేదు." ఈ ఒక్కమాట చెప్పేసరికే మొహం చెమటపట్టి. కాళ్ళు వణకసాగా యామెకు.

"ఆఁ! ఏమిటి? ఏమీలేదా? అయితే మరీ మంచిది. అమ్మా! ఇహ నువ్వు మొదలెట్టు." అమ్మవైపు సూటిగా చూసే ధైర్యం లేక కుర్చీ చేతులమీద గోళ్ళతో గీస్తూ అన్న మాటలివి.

"ఒరేయ్, నీకిదేం పోయే కాలం వచ్చిందిరా?, నేరంచేసిన వాళ్ళనడిగి నట్టు ఇలా

"నిలదీసి అడిగితే ఏం చెబుతార్రా? " అంత వరకూ బిగబట్టుకున్న కోపాన్నంతా కక్కేసింది అమ్మ. ఆ కోపాగ్ని వేడికి నామనసెక్కడ కరిగి పోతుందోనని భయపడ్డాను. అలా జరగలేదు.

"ప్రతిరోజూ మీలో మీకు పోట్లాటలెందుకొస్తాయ్ ?"

"ఏమో బాబూ ! నాకలా చెప్పడం చాతకాదు."

"అంటే చెప్పవలసిం దేమీ లేదనేగా అర్థం ?"

"పోనీ అలాగే అనుకో మహానుభావా ! ఇంతకీ నిన్ననవలసిందేమీ లేదులే. నా ఖర్మం కాలి నీలాంటి సుపుత్రుణ్ని కన్నందుకు మా బాగా చేస్తున్నావు....వచ్చే ఆదివారం వరకూ జరిగినవన్నీ చిట్టిచేత వ్రాయించి పెడతాలే" ఉక్రోషంతో అంది మా అమ్మ.

"అయితే ఇవాళటి కేం లేదన్నమాట ?"

"లేదు"

నా మీదినుంచి పెద్దబరువు దిగిపోయినట్లయింది. నాన్నవైపు తిరిగి "నాన్నా ! మీరూ విన్నారుగా అంతా ? ఇహ వచ్చే ఆదివారందాకా ఇంట్లో ఏ గొడవా వుండదులెండి" అన్నాను.

అక్కడితో మా తొలి సమావేశం ముగిసింది.

పిల్లలంతా పెద్దగా అరుస్తూ బయటికెళ్ళిపోయారు. అమ్మ, చిట్టి ఇద్దరూ వంటింట్లోకెళ్ళి గుస గుస లాడుకోసాగారు. మా ఆవిడ రుస రుసలాడుతూ వెళ్ళి మంచంమీద పడింది.

ఆరోజు రాత్రి సినిమాకెళ్ళి వచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఆ గంభీర వాతావరణం చూసి సందేహిస్తూనే లోపలికి అడుగు పెట్టాను. అయితే భయపడవలసినదేమీ జరగలేదు ఇంట్లో. బాత్‌రూంలోకెళ్ళేటప్పటికి వేణ్ణీళ్ళు సిద్ధంగా వున్నాయి

కాళ్లూ, చేతులూ కడుక్కుని వంటింట్లోకి వచ్చేసరికి భోజనం రెడీ ! అది ముగించి గదిలోకి వచ్చేసరికి పక్క సిద్ధం. ఇన్ని ఏర్పాట్లూ నిశ్శబ్దంగా జరిగిపోతూండడం చూసి లోలోపల సంతోషిస్తూ పక్కమీద వాలానో లేదో ధుమ ధుమ లాడుతూ గదిలోకి ప్రవేశించింది శ్రీమతి.

"ఇంట్లో ఎవరు ఏమన్నారో స్పష్టంగా అదీ వాళ్ళముందే ఎలా చెప్పి చావనండీ ! ఆఁ ! చాల్లెండి దొంగనిద్ర. కట్టుకున్న పెళ్ళాం ఏమైపోయినా మీ కక్కర్లేదు.... సాయంకాలం మీ రటు వెళ్ళగానే ఇంట్లో వాళ్ళందరూ నా మీద ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. మీకు ఏదో మందు పెట్టానట. మిమ్మల్ని లోబరచుకుని ఇంట్లోవాళ్ళనందర్నీ వెళ్ళగొట్టాలని పన్నాగం పన్నానట. పచ్చగా కళకళ లాడుతున్న కాపురాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నానట. ఇంకా ఏమిటేమిటో నోటికొచ్చినట్టల్లా అన్నారు."

వాక్ప్రవాహం ఆగిపోయి కళ్ళల్లోంచి గంగాప్రవాహం మొదలయింది.

ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోయేవాణ్నేమోగాని, అంతలోనే "ఆలికీ అలుసివ్వకు" అన్న సామెత గుర్తుకొచ్చి నిగ్రహించుకున్నాను.

"వచ్చే ఆదివారందాకా ఎవరిమీదా ఏ విధమైన ఫిర్యాదులూ చెప్పకూడదు. అందులో నీ తప్పేమీ లేకపోతే మీటింగులో నిర్భయంగా చెప్పుకోవచ్చు. ఎవరికీ భయ



పడవలసిన అవసరంలేదు" అని చెప్పి ముసుగుతన్ని పడుకున్నాను. ఒకవేళ ఆమె మొహంలోకి చూస్తే మళ్ళీ జావలా అయిపోతానేమోనన్న భయం లోలోపల పీకుతూనేవుంది.

రెండవ ఆదివారం వచ్చింది. మధ్యాహ్నం రెండుగంటలకు మళ్ళీ ఇంట్లో వాళ్ళందరం సమావేశమయ్యాం. అందరికన్న ముందు అమ్మ ప్రారంభించింది.

"ఇదుగో అబ్బాయ్. నేను వంట చేసేటప్పుడు కావలసిన వస్తువు లందించకపోతే, నే నసలు వంటే చేయను."

అమ్మకింత ధైర్యం రావాలంటే ముందే ఆలోచించుకుని పెట్టుకొని వుండాలికదా.

"ఏరోజు నీ కోడలు ఎందుకలా చేసిందో ఆలోచించావా అమ్మా ?"

"అప్పన్నే తప్పు చేసింది నీ పెళ్ళాం కాబట్టి అవన్నీ ఆలోచించాలేమో ! అలాంటప్పుడు నువ్వేందుకున్నట్లు ? ఈ వెధవ మీటింగు ఎందుకు పెట్టినట్టు ?"

"అది కాదమ్మా ! నీకు కావలసిన వస్తువులు అందించకపోవడానికి కారణమేమిటి అని ?"

"నువ్వు చెప్పవే చిట్టీ."

అమ్మ పురమాయింపుతో చిట్టి కాస్త ముందుకు జరిగి,

"ఇవ్వాళ పొద్దున్నే అన్నం తప్పాలా అందివ్వమని అయిదుసార్లు కేకేసింది అమ్మ" అంది.

ఆడబడుచు మాట్లాడడం మొదలెట్టగానే శ్రీమతి కెక్కడిలేని కోపమూ వచ్చి మధ్యలోనే అంది :

"నే నప్పుడు బాయిలర్‌లో నీళ్ళు నింపుతున్నానండి. అక్కడే చెక్కమీద బోర్లించానని ఎన్నిసార్లరచినా వినిపించుకోకపోతే నేనేం చేయను చెప్పండి ? ఇంతకూ చిన్నమ్మాయిని పిలిచి చెప్పానుకూడా. అమ్మతో చెప్పమని"

"అవునన్నయ్యా ! వదిన చెప్పగానే నేను వెళ్ళి అమ్మతో చెప్పాను." అంది చిన్నచెల్లెలు.

అందరూ కలిసి చివరికి తననే తప్పు పట్టడం సహించలేక పోయింది అమ్మ.

"తనే వచ్చి ఇచ్చివుంటే చేతులరిగిపోయేవా అంట ?" అని కాసేపాగి మళ్ళీ "నీళ్ళు మరిగిపోతున్నాయి. ...కాసిని చన్నీళ్ళు పోసి రమ్మంటే వున్న నీళ్ళన్నీ పోసి చల్లగా చేసేసింది. ఆ చన్నీళ్ళు పోసుకుని పిల్ల లేమైపోవాలని ?" అంది కోడలి వైపు కొరకొర చూస్తూ.

"అమ్మ చెప్పిందంతా నిజమేనా ?" అని అడిగాను మా ఆవిడను.

"అంటే నే నబద్ధాలకోర్ననా. నీ ఉద్దేశం ?" గయ్యిమని లేచింది అమ్మ.

"నువ్వు కాస్త వూరుకోమ్మా. నే నడిగింది నీ కోడలిని. దానికి సమాధానం ఆమే చెప్పాలి. ఊఁ ! చెప్పు"

"..........."

"అలా నోరు మూసుక్కూర్చుంటే కుదరదు."

"మరీ అంత చల్లారలేదండీ ! గోరువెచ్చగా వున్నాయి. నేను అలా ఎందుకు చేస్తానండీ ?" మెల్లిగా నోరు విప్పింది.

"ఏంలేదు. నీళ్ళన్నీ చల్లారిపోయి వున్నాయి. నేను చిట్టిని చూడమన్నాను కూడా" అమ్మ సాధింపు.

"అవును. చల్లగానే వున్నాయి" చెల్లెలి సాక్ష్యం.

"పోనీలేరా. దానికంత గొడవెందుకు?" అన్నారు నాన్న సానుభూతిగా.

"ఇంకెప్పుడూ అలా చేయనులెండి." శ్రీమతి సంజాయిషీ.

కళ్ళల్లోంచి గంగాభవాని ప్రత్యక్ష మయింది.

అంతటితో ఆనాటి సభ ముగిసింది.

ఇంటికి మూలస్తంభాల్లాంటి ముగ్గురాడ వాళ్ళనూ రెచ్చగొట్టాను గదా ఇహ వీళ్ళ మధ్య బ్రతకడమెలాగా.! అన్న ప్రశ్న బృహదాకారం దాల్చి నిల్చుంది నాముందు. తిన్న తిండి వంటపట్టడంలేదు. రాత్రిం బవళ్ళు ఇదే చింత.

మా యింటి వాతావరణమే మారి పోయింది హఠాత్తుగా. ఒకరితో మరొకరు మాట్లాడడమే అరుదైపోయింది. ఇంట్లోని పనులన్నీ సైగలతోనే జరిగిపోతున్నాయి.

అదృష్టవశాత్తూ మధ్యలో రెండువారాలు క్యాంపుకెళ్ళవలసి వచ్చింది. ఈ దుర్భర వాతావరణంలోనుంచి కొన్నాళ్ళపాటయినా తప్పుకుని హాయిగా వుండవచ్చుకదా అని సంతోషమైంది నాకు.

క్యాంపు వెళ్ళి రెండు వారాల తరువాత తిరిగి వచ్చేశాను.

మరో ఆదివారం రానేవచ్చింది.

ఆరోజు సమావేశం అనుకున్నప్రకారం, అంటే రెండుగంటలకు ప్రారంభమయింది.

ఎలా ప్రారంభించాలా అని బుర్ర గోక్కుంటున్నాను. ఇంతలో అమ్మే మొద లెట్టింది :

"ఇంటి యజమాని అయితే మాత్రం నెత్తిమీద కొమ్ము లుంటాయేమిటి? వేళకు సరిగ్గా వచ్చి తిండి తినక్కర్లా?" అక్క సుగా అంది.

"నెలకొకరోజైనా కాస్త ఇంటిగొడవలు పట్టించుకోపోతే ఎలాగండీ? ఇంట్లో ఏ వస్తువులున్నాయో, ఏవి లేవో కనుక్కుని తెచ్చిపడేస్తే ఇటు చేసేవాళ్ళకీ అనుకూలం, అటు చేసేవాళ్ళకూ సుఖంగా వుంటుంది" బ్రహ్మాస్త్రాన్నీ ప్రయోగించింది మా ఆవిడ.

"అయినా నీకు బొత్తిగా ఏమీ తెలీ దప్పోయ్! అసలే ఆమెది నాజూకు శరీరం దానికితోడు తోటిచూలు కూడా; ఎంత జాగ్రత్తగా చూసుకోవాలీ ఏం కథ ?"

నా చెవులను నేనే నమ్మలేకపోయాను. అమ్మేమిటి ? అలా మాట్లాడడమేమిటి ?

మొత్తానికి ఆరోజు తాము చెప్పవల సిన మాటలను మరొకరిచేత చెప్పించి అందరూ మంచివాళ్ళయిపోయారు. టపా కాయల్లా పేల్తున్నాయి మాటలు. నాకు జవాబుచెప్పడానికి కూడా వ్యవధినివ్వటం లేదెవరూ. ఆ ధాటికి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరయి పోయి. నోరు వెళ్ళబెట్టి కూర్చుండిపోయాను. ఒళ్ళంతా చెమట పట్టేసింది.

"ఇవాళ మేమందరం చిక్కడపల్లి గుడి కెళ్ళాలనుకుంటున్నాం. మళ్ళీ చీకటి పడేలోగా వచ్చి వంట చేసికోవాలి" అంటూ లేచి వెళ్ళిపోయింది మా ఆవిడ-నా జవాబు కెదురు చూడకుండానే. ఆవిడ వెనకాలే అందరూ లేచి వెళ్ళిపోయారు.

నా బుర్రనిండా ఏవేవో ఆలోచనలు పుట్టుకొచ్చాయి.

"వీళ్ళందరూ ఎలా ఒకటయ్యారు ?"

లేచి పచార్లు చేయ నారంభించాను. నా పచార్లకు హాలు, పడకగది, వంటిల్లు, వసారా ఇవేవీ చాలలేదు.

ఎంత ఆలోచించినా జవాబు వెతుక్కో లేకపోయాను. చివరికి విసుగుపుట్టి నాన్న గారి ముందు వెళ్ళి నిలబడ్డాను. నాన్న గుర్రుపెడుతున్నారు కుర్చీలోనే.

"నాన్నా ! నాన్నా !"

"ఏరా ? ఏమంటుంది ?" ఉలిక్కిపడి కళ్ళు తెరిచారు నాన్న.

"మరేంలేదు. ఇహ ఇవ్వాళటినుంచి ఆదివారం సమావేశాన్ని ఆపుచేస్తున్నాను."

నాన్న మాట్లాడలేదు. కాసేపు ఆలో చించి.

"ఆపుచేస్తున్నాననకు. కొంతకాలం వరకూ వాయిదా వేస్తున్నానని చెప్పు. మళ్ళీ ఎప్పుడైనా పనికివస్తుంది నీ యీ 'రామ బాణం' " అన్నారు.

# ప్రవల్హిక

ఏ నిశ్శబ్ద ప్రపంచాలమధ్య
ఏ(వి)టి నీ కళ్ళు మాట్లాడుతున్నాయి
ఉత్తర ధ్రువంలో మంచువంటి తెల్లని
హృదయంగలదానా ఆడదానా
ఎన్ని పూర్వజన్మల స్మృతుల జాడలు
ఈ క్షణంలో నీ కనురెప్పల నీలి నీడలు

నక్షత్రాలనుధ్య ఆకాశంవంటి
నల్లని కళ్ళదానా ఓ ఆడదానా
సృష్టి ముందటి చీకట్లోంచి ఏరుకున్న
సౌందర్యాన్ని నీ కళ్ళల్లో నింపుకున్నావు
సృష్టిచివర లయంలోని శూన్యాన్ని నన్ను
స్పష్టమవని కామంతో బంధించుకొన్నావు.

చీకటివంటి నీ విచిత్రవీక్షణాకర్షణకి
సంధ్యాగగనంమీద ఎర్రని ఆందోళనని నేను
క్షితిజ రేఖలా వొంగిన నీ భుజాలు వొంపుదగ్గిర
చెదరి విరిగిన సముద్రపు కెరటాన్ని నేను
ఆడదానా అద్భుతమైనదానా క్వణత్ వీణా
అర్థంలేని నన్ను చుట్టుకొన్న [illegible]రమార్గానివి నువ్వు.

దట్టమైన అడవులలోని నిగూఢ రహస్యాలు
దాచుకున్న కన్నులుకలదానా ఆడదానా
స్వర్గనరకాల సరిహద్దులమధ్య నిలిచి నీవు
సమ్మోహమంత్రం జపించే శృంగారావధీ। విధీ।
నాకు తల్లివి నెచ్చెలివి చెలివి
నన్ను కౌగలించుకున్న పెద్దపులివి.

బాలగంగాధర తి